క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణ నిమిత్తం విరాళం అందజేస్తున్న దాతలు

కొయ్యలగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (తాడేపల్లిగూడెం రోడ్డు) నూతన ఆలయ నిర్మాణానికి ఆదివారం దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు మేకల అన్నవరం, కోశాధికారి విశ్వనాథ శర్మ తెలిపారు. శ్రీ లక్ష్మి గణపతి స్టీల్స్ యజమాని ప్రగడ వీరభద్ర స్వామి రూ.10,116, తాడేపల్లిగూడెంకి చెందిన ఆర్‌ఎస్ఎల్ ప్రసాద్ రూ.5 వేలు అందజేసినట్లు చెప్పారు. ఆలయ నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలు అందించాలని కోరారు.

మహాకవి శ్రీశ్రీ వర్ధంతి

కొయ్యలగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహాకవి శ్రీశ్రీ వర్ధంతి నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. శ్రీశ్రీగా ప్రపంచానికి పరిచయం అయిన శ్రీరంగం శ్రీనివాసరావు విప్లవ కవిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా ప్రజల హృదయాల్లో నిలిచారని రాముడు విద్యార్థులకు వివరించారు. ఎందరో యువ కవులకు శ్రీశ్రీ స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం అత్యంత ప్రజాదరణ పొందిన రచనల్లో ఒకటనీ, ప్రతి విద్యార్థి మహాప్రస్థానం గురించి తెలుసుకోవాలన్నారు.

ముగిసిన గంగానమ్మ జాతర



జాతరకు వెళ్లేందుకు కొయ్యలగూడెం చెక్ పోస్ట్ సెంటర్‌లో ప్రయాణికుల రద్దీ

కొయ్యలగూడెం: పోతవరం గ్రామదేవత శ్రీ గంగానమ్మ (ఊడుగులమ్మ) అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ముగిసింది. గత 15 రోజులుగా నిర్వహిస్తున్న జాతర ఉత్సవాల్లో భాగంగా 14వ తేదీ రాత్రి అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా ఆఘం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు మరుసటి రోజు బంధుమిత్రులను జాతర విందుకు ఆహ్వానించడంతో పరిసర గ్రామాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలి వెళ్లారు. ముగింపు రోజు అమ్మవారి దర్శనంతో పాటు జాతర ఉత్సవాన్ని తిలకించేందుకు ఏజెన్సీ మెట్ట ప్రాంత నుంచి ప్రజలు ఆదివారం భారీగా తరలివచ్చారు. దీంతో బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

గంగానమ్మకు జలాభిషేకం



గంగానమ్మ తల్లికి జలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో విరాజిల్లాలని కోరుతూ పట్టణంలోని గంగానమ్మ తల్లికి ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. సువాసినులు అమ్మవారికి బిందెలతో శాస్త్రోక్తంగా జలాభిషేకం జరిపారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.

జంగారెడ్డిగూడెంలో సత్యసాయి రథయాత్ర

జంగారెడ్డిగూడెం: భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి రథయాత్ర ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలో వైభవంగా జరిగింది. భక్తులు మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్య సాయి 100వ పుట్టినరోజు వేడుక సెప్టెంబర్ 23న పుట్టపర్తి ప్రశాంతి నిలయం నందు జరుపబడుతుందన్నారు. ఆహ్వాన కార్యక్రమంలో భాగంగా స్వామివారి రథయాత్ర ద్వారా పాదపద్మ దర్శనం అందరికీ కల్పిస్తూ ముందుకు సాగుతున్నట్లు వివరించారు.

బాలకృష్ణశర్మకు స్వర్ణకంకణ సన్మానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జ్యోతిష్య రంగంలో విశేష సేవలు అందిస్తున్న నగరానికి చెందిన గుడిమెట్ల బాలకృష్ణ కిశోర్ శర్మ అవధానికి స్వర్ణ కంకణ సన్మానం చేశారు. అంతర్జాతీయ వైదిక వేద విజ్ఞాన సమాఖ్య, విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ ఆదివారం హైదరాబాద్ హబ్సిగూడలో నిర్వహించిన వైదిక జ్యోతిష్య సమ్మేళన కార్యక్రమంలో బాలకృష్ణ శర్మకు అతిథులు ఈ అరుదైన సన్మానం చేశారు. జ్యోతిష్య శాస్త్రంలో ప్రతిభ చూపుతూ జ్యోతిష్య శాస్త్ర మెళకువలను, ధర్మ సందేహాలను నివృత్తి చేస్తూ జ్యోతిష్య వాచస్పతిగా పేరుగడించారని అతిథులు కొనియాడారు. విశ్వజ్యోతి జ్యోతిష విజ్ఞాన సంస్థ అధ్యక్షుడు గేడం విశ్వనాథ్, ఐసీఏఎస్ చైర్మన్ జొన్నలగడ్డ శ్రీనివాస రావు, జ్యోతిష పండితుడు చక్రధర్ సిద్ధాంతి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రయాణం.. ప్రహసనం

- అధ్వానంగా ముంజులూరు – గోగుమిల్లి గ్రామాల రహదారి
- ఇటీవల వర్షాలకు కోతకు గురై ఛిద్రమైన రోడ్డు
- అవస్థలు పడుతున్న గిరిజనులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామాలైన పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఈ రహదారి వెంబడి ఉప్పరిల్ల, ముంజులూరు, చింతపల్లి, గోగుమిల్లితోపాటు ఒర్రింక, గడ్డపల్లి, గిన్నేపల్లి, చిలకలూరు, దారావాడ, తదితర అటవీప్రాంతాల్లోని గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల గిరిజనులు ఈ రహదారి నుంచే ప్రయాణం చేయాల్సి ఉంది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకూ తారు రోడ్డు వేశారు. అనంతరం రహదారి కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. దీంతో వర్షాలకు రహదారి దెబ్బతినడంతో అత్యవసరంగా ఆస్పత్రికి వెళ్లాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో రూ.4.30 కోట్లు మంజూరు

బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వరకూ రోడ్డు పనులు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సుమారు రూ.4 కోట్ల 30 లక్షల నిధులను ఎస్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా రహదారి పనులకు శంకుస్థాపన కూడా చేశారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఆ పనులు నిలిచిపోయాయి.

ఛిద్రమైన రోడ్లపై గిరిజనుల అవస్థలు

గత కొద్దిరోజులుగా కురుస్తన్న భారీ వర్షాలకు పులిరామన్నగూడెం, గోగుమిల్లి రోడ్డు అధ్వానంగా తయారైంది. పై గ్రామాల నుంచి కొండరెడ్డి గిరిజనులు ప్రతి బుధవారం కన్నాపురం వారాంతపు సంతకు, ఐటీడీఏలో జరిగే గిరిజన దర్బారుకు వచ్చి తమ సమస్యలను చెప్పుకుంటారు. సుమారు 12 కిలోమీటర్ల పరిధిలో రోడ్డు ఛిద్రమవ్వడంతో గిరిజనుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ప్రభుత్వం, అధికారులు రోడ్డు పనులు చేపట్టాలని కొండరెడ్డి గిరిజనులు కోరుతున్నారు.



అధ్వానంగా ముంజులూరు, గోగుమిల్లి రహదారి

రహదారి మరమ్మతులు చేపట్టాలి



ఇటీవల వర్షాలకు పులిరామన్నగూడెం, గోగుమిల్లి రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. పెద్దపెద్ద గోతులు ఏర్పడి ఛిద్రంగా మారింది. కనీసం ద్విచక్ర వాహనంపై కూడా ప్రయాణం చేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి రహదారి మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలి.

– కెచ్చెల ముక్కారెడ్డి, సర్పంచ్, ముంజులూరు

అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేదు



మా గ్రామంలో కొండరెడ్డి గిరిజనులకు అనారోగ్యం చేస్తే అంబులెన్స్ కూడా వచ్చే పరిస్థితి లేదు. పులిరామన్నగూడెం, గోగుమిల్లి రోడ్డు పాడైపోవడం వల్ల ఎవరికైనా అనారోగ్యం చేసిన వారిని ద్విచక్ర వాహనంపై కూడా తీసుకువచ్చే పరిస్థితిలేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించే విధంగా కృషి చేయాలి.

– నడపల ముక్కారెడ్డి, చింతపల్లి

పేకాట స్థావరంపై దాడి.. ఏడుగురి అరెస్ట్



పంగిడిగూడెంలో జూదరులను అదుపులోకి తీసుకున్న భీమడోలు సీఐ విల్సన్

ద్వారకాతిరుమల: పంగిడిగూడెంలో ఒక పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. భీమడోలు సీఐ యుజే విల్సన్‌కు అందిన సమాచారం మేరకు ఆయన ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్, సిబ్బందితో కలసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.39 వేలు నగదు, 11 సెల్‌ఫోన్‌లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజు బదిలీ

దెందులూరు: కొవ్వలిలోని నియోజవర్గ స్థాయి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గోల్డెన్ రాజు నర్సాపురం హాస్టల్‌కు బదిలీ అయ్యారు. హాస్టల్లో ఒక ఏవో ఇద్దరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉండగా రాజు బదిలీతో ఒక ఖాళీ ఏర్పడింది. హాస్టల్లో వెల్ఫేర్ ఆఫీసర్ భర్తీపై జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చామని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏవో సత్యనారాయణ వివరించారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు

సబ్ డివిజన్‌లో ఏటా 35,500 ఎకరాల్లో లక్ష్యం

చింతలపూడి: తొలకరి సీజన్ ప్రారంభం అవుతుండటంతో మెట్ట రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్ పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టి నరసాపురం మండలాల్లో వరి పంటను సాగు చేసుకోవడానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ బోర్ల కింద నారు మళ్లు పోయడానికి రైతులు విత్తనాలను సిద్ధం చేసుకున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్ పరిధిలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 35,500 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తుంటారు. ఇవి కాక 350 ఎకరాల్లో మొక్కజొన్న, 160 ఎకరాల్లో వేరుశనగ పంటలు పండిస్తారు. రబీ సీజన్‌లో సుమారు 1,500 హెక్టార్లలో వరి, 18 వేల హెక్టార్లలో మొక్కజొన్న, 2,500 హెక్టార్లలో వేరుశనగ పంటలను రైతులు అధికంగా సాగు చేస్తుంటారని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సీజన్ ప్రారంభం కావడంతో సన్న, చిన్నకారు రైతులు పెట్టు బడులకోసం కొట్టుమిట్టాడుతున్నారు. బ్యాంకులు, సహకార సంఘాలు రైతులకు వెంటనే ఖరీఫ్ రుణాలు అందిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయి.



చింతలపూడి ప్రాంతంలో ఖరీఫ్ దుక్కులు దున్నుకుంటున్న రైతు

విత్తనాలకు కొరత లేదు



సబ్‌డివిజన్ పరిధిలో విత్తనాల కొరత లేదు. రైతులు భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి సూక్ష్మ పోషక లోపాలను అధిగమిస్తూ ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందచేశాం. నియోజకవర్గంలో 3,152 క్వింటాళ్ళ పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశాం. రైతులు ముఖ్యంగా యంత్రాలతో ప్లాంటేషన్, వెదజల్లే పద్ధతుల్లో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు.

– బి నాగకుమార్, ఏడీఏ, వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్

రుణాలు అందించాలి



ప్రభుత్వం బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రైతులకు సకాలంలో పంట రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలి. ప్రతి రైతుకు గరిష్టంగా వడ్డీ లేని రుణాలను అందించాలి. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే పెట్టుబడి సాయం అందించాలి. మెట్ట రైతులకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలి.

– బోడ వజ్రం, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ఈకేవైసీ చేయించుకున్న రైతులకే అన్నదాత సుఖీభవ

చింతలపూడి: సబ్ డివిజన్‌లోని అర్హత కలిగిన రైతులు అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే తప్పనిసరిగా రైతు సేవ కేంద్రాల్లో ఈ కేవైసీ చేయించుకోవాలని చింతలపూడి వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు బి.నాగకుమార్ ఆదివారం సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందాలంటే ఓటీపీ ద్వారా నమోదు చేసే అవకాశం లేదని చెప్పారు. రైతులు రైతు సేవ కేంద్రం వద్ద ఈకేవైసీ వేలిముద్ర వేసిన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు. సోమవారం రైతు సేవా కేంద్రాల వద్ద ఉన్న అర్హుల జాబితాను రైతులు పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

22 నుంచి సీపీఎం శిక్షణ తరగతులు

కొయ్యలగూడెం: ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు సీపీఎం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి పేర్కొన్నారు. ఆదివారం కన్నాపురంలోని ఫంక్షన్ హాల్లో ప్రజా సంఘాలతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులపాటు జరగనున్న శిక్షణ తరగతుల్లో రెండు వందల మంది కార్యకర్తలు పాల్గొంటారన్నారు. ఈ సమావేశాల్లో చట్టాలు, ప్రజలు, ఉద్యోగ, కార్మిక, రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు, ఆకులు దుర్గారావు, కె.సీతారాములు పాల్గొన్నారు.

నేటినుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

కామవరపుకోట: ద్వారకాతిరుమల దేవస్థానం ద్వారా నడపబడుచున్న స్థానిక శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చల్లా వేణు గోపాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, 10వ తరగతి పాసైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'కన్నప్ప'లో ఆ పదాలను తొలగించాలి

కొయ్యలగూడెం: త్వరలో విడుదల కానున్న కన్నప్ప సినిమాలో బ్రాహ్మణులను కించపరిచే విధంగా ఉన్న పదాలను తొలగించాలని ప్రాంతీయ బ్రాహ్మణ సేవా సంఘం ప్రముఖ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం గవరవరంలో సంఘ అసోసియేషన్ అధ్యక్షుడు అనిపెద్ది వెంకట రాధాకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించన సమావేశంలో కన్నప్ప సినిమాకి వ్యతిరేకంగా ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

మెగా వైద్యశిబిరంలో 150 మందికి వైద్యసేవలు

బుట్టాయగూడెం: అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వారి సౌజన్యంతో సమైఖ్యంగా ఆదివారం స్థానిక కరాటం కృష్ణమూర్తి ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఎముకలు, స్త్రీల చెవి, ముక్కు, గొంతు, పిల్లలు, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. ఈసీజీ, అల్ట్రాస్కాన్ వంటి పరీక్షలను కూడా నిర్వహించి రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పైగా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేసినట్లు సేవా సమితి ప్రతినిధులు నంబూరి రామచంద్రరాజు, గొట్టుముక్కల భాస్కరరాజు తెలిపారు. అలాగే ఇదే వైద్యశిబిరంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది యువకులు రక్తదానం చేశారని చెప్పారు.



వైద్యశిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

పంచాయతీ స్థలంలోని చెట్ల నరికివేత

కొయ్యలగూడెం: కన్నాపురం పంచాయతీ మహాదేవపురం గ్రామంలో ఆదివారం చెట్లు నరికి వేయడం వివాదాస్పదమైంది. పంచాయతీ వాటర్ ట్యాంకు ఉన్న ప్రాంతంలో సుమారు ఇరవై సెంట్లకి పైగా ఉన్న స్థలంలో కొందరు వ్యక్తులు విలువైన జామాయిల్, మారుజాతి కలపను నరికి వేశారని రైతులు ఆరోపించారు. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని, చెట్లు అక్రమంగా నరికిన వ్యక్తులు ప్రభుత్వ సెలవు రోజుల్లో కావాలనే ఈ దుశ్చర్యకు ఒడికట్టారని స్థానికులు ఆరోపించారు. దీనిపై పంచాయతీ శాఖ అధికారులు విచారణ చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహాదేవపురం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



మహాదేవపురం వాటర్ ట్యాంక్ వద్ద అక్రమంగా నరికి వేసిన చెట్లు

సమస్యలపై ఐక్యంగా పోరాడతాం

దెందులూరు: సమస్యల పరిష్కారానికి ఐక్యంగా, ప్రణాళికబద్ధంగా పోరాడుతామని రెవెన్యూ అధికారుల సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు సాయిల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆర్‌ఎస్సార్ రాంబాబు పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఏలూరు డివిజన్ అధ్యక్షుడిగా ఉన్న సాయిల వెంకటేశ్వరరావును ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా రాంబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వీఆర్‌ఓలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తానని పేర్కొన్నారు. వీఆర్‌ఓ గ్రేడ్ –1, గ్రేడ్ – 2లు అంతా ఐక్యంగా ఉండాలని, సమస్యలపై కలిసి కట్టుగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యే తపస్య లక్ష్యం

కామవరపుకోట: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తపస్య స్కూలు లక్ష్యమని ఆ విద్యాసంస్థల చైర్మన్ తోకల రాజేష్ అన్నారు. పిల్లలకు కేవలం చదువే కాకుండా యాక్టివిటీస్ కూడా నేర్పుతామన్నారు. అకడమిక్ డైరెక్టర్ జగన్ మాట్లాడుతూ బట్టీ విధానం కాకుండా జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో విద్యార్థులు నైపుణ్యాన్ని చాటేలా తీర్చిదిద్దుతామన్నారు. ఒకొక్క తరగతి గదికి గరిష్టంగా 24 మంది విద్యార్థులు మాత్రమే ఉంటారని, ప్రతి క్లాస్ రూమ్‌ను ఏసీ డిజిటల్ క్లాస్ రూమ్‌లా తీర్చిదిద్దామన్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో తపస్య విద్యా సంస్థలో చేరబోయే విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు డైరెక్టర్ జగన్ ప్రకటించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఏలూరు టౌన్: ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం నగలు అపహరించుకుపోయిన ఘటన ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని తూర్పు వీధి కల్పనా బేకరీ సమీపంలో కామాడ జాబిల్లి అనే వృద్ధురాలు నివాసం ఉంటుంది. భర్త చనిపోవడంతో ఆమె ఒంటరిగా జీవిస్తుంది. ప్రస్తుతం బ్రిలియంట్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం ఆమె ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చి చూసుకునేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా 60 కాసుల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గుర్తించింది. వెంటనే ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చింది.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాల బకాయిలు చెల్లించాలి



చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పారిశుద్ధ్య కార్మికుల నిరసన



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల పెండింగ్ జీతాలను తక్షణం విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రటరీ తోర్లపాటి బాబు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆదివారం కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తొర్లపాటి బాబు మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత ఐదు మాసాల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, 15 నెలల పీఎఫ్ పెండింగ్‌లో ఉందని, వీటిని తక్షణం విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ చింతలపూడి శాఖ అధ్యక్షురాలు టీ మరియమ్మ, నాగరాజు, కుమారి, వాణి, సీపీఐ మండల కౌన్సిల్ సభ్యులు ముల్లగిరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్ కార్మికుల ధర్నా

జంగారెడ్డిగూడెం: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజు మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ పారిశుద్ధ్యం కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఏజెన్సీను తొలగించి ప్రభుత్వమే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సంజీవ్, మేరీ, చంద్రకళ, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆదరణ అందరి బాధ్యత

జంగారెడ్డిగూడెం: ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవ సందర్భంగా ఆదివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీతా మహాలక్ష్మి వృద్ధాశ్రమం నందు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అధ్యక్షుడు జీఎస్‌ఆర్.మూర్తి మాట్లాడుతూ వృద్ధులను ఆదరించడం మన బాధ్యత అని అన్నారు. పిల్లలు పట్టించుకోకుండా నిర్లక్ష్యానికి గురవుతున్న వృద్ధులు రెవెన్యూ వారిని గాని లేదా స్వచ్ఛంద సేవా సంస్థలనుగాని ఆశ్రయించవచ్చని, వారికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు మండల న్యాయ సేవ అధికార సంస్థను ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా బార్ మెంబర్లు అచ్యుత శ్రీనివాసరావు, బండారు లతాకుమారి, హరి తదితరులు పాల్గొన్నారు.



సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

వృద్ధులు సమాజానికి సంపద

జంగారెడ్డిగూడెం: వృద్ధులు సమాజానికి సంపద అని వారిని కాపాడుకోవాలని బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపు నివారణ అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వృద్ధుల రక్షణ కోసం చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. అనంతరం సభ్యులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామచంద్రరావు, త్రినాథరావు, బాలకృష్ణ, గాంధీ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నేత్ర సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేత్ర సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి చిన్న సమస్య వచ్చినా అది అంధత్వానికి దారితీసే ప్రమాదం ఉంని సెట్‌వెల్ సీఈఓ కె.సూర్య ప్రభాకర రావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో సామాజికవేత్త మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం, ఉషా గ్రూపు సంస్థల అధినేత వీవీ బాలకృష్ణ సహకారంతో ఉచితనేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ప్రభాకర రావు నేత్ర సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందడం ద్వారా అంధత్వానికి దూరంగా ఉండాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ నేత్ర దానంపై అవగాహన కలిగి ఉండాలని, చనిపోయిన తరువాత నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించి తమ నేత్రాలకు పునర్జన్మ ఇవ్వచ్చన్నారు. ఈ సందర్భంగా 126 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి 15 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్స నిర్వహించడానికి వేమగిరిలోని ఆసుపత్రికి తరలించారు. మరో 18 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ డెవలప్మెంట్ చైర్మన్ మేతర అజయ్ బాబు, పిల్లి పండరీనాథ్, బొలిశెట్టి సురేష్ కుమార్ పాల్గొన్నారు. గత 18 ఏళ్లుగా ప్రతినెలా మూడో ఆదివారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహిస్తున్నామని నేత్ర సమస్యలున్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మానేపల్లి రామారావు కోరారు.